# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  12-12-2025                                సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఏఐ, డేటా సెంటర్లతో విశాఖ నగరం ఐటీ డెస్టినేషన్ గా మారుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- విశాఖలో 5 లక్షల ఐటి ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- పెట్టుబడులను ఆకర్షించి లక్షలాది ఉద్యోగావకాశాలను కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.
- చింతూరు బస్సు ప్రమాద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొంటుందని హోంమంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖ పర్యటనలో భాగంగా విశాఖ- కాగ్నిజెంట్ టెక్నాలజీస్ కార్యాలయ నిర్మాణానికి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇన్ హౌస్ కంపెనీగా ఉన్న కాగ్నిజెంట్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పనిచేస్తోందని, ప్రస్తుతం విశాఖలో నూతన క్యాంపస్ ప్రారంభమైందని అన్నారు. భవిష్యత్తులో విశాఖ క్యాంపస్ లో లక్ష మంది ఉద్యోగులు పని చేయాలని ఆకాంక్షించారు. కాగ్నిజెంట్ లో 85 శాతం మంది భారతీయులేనని, సంస్థ సీఈఓ కూడా భారతీయుడే కావడం విశేషమని అన్నారు. ఏఐ, డేటా సెంటర్లతో విశాఖ ఐటీ డెస్టినేషన్ గా, నాలెడ్జ్ ఎకానమీ కేంద్రంగా తయారవుతోందని, ప్రపంచంలోనే మోస్ట్ హ్యాపెనింగ్ సిటీగా విశాఖ రూపుదిద్దుకుంటోందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్...28 సెకన్లు)

====================

రాష్ట్ర ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ ఈరోజు విశాఖలో పలు సంస్థల కార్యాలయ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. సత్వా వాంటేజ్ వైజాగ్ క్యాంపస్, క్వార్క్స్ టెక్నో సాఫ్ట్ ప్రయివేట్ టిమిటెడ్, మదర్సన్ టెక్నాలజీస్ సర్వీసెస్ లిమిటెడ్, ఫ్లూయెంట్ గ్రిడ్ లిమిటెడ్, ఇమేజ్ ఇన్నోవేటివ్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్ సంస్థల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. విశాఖ- కాగ్నిజెంట్ టెక్నాలజీస్ కార్యాలయ నిర్మాణానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. వచ్చే మూడున్నరేళ్లలో విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తామని, విశాఖలో ప్రపంచస్థాయి విద్యాప్రమాణాలు నెలకొల్పుతామని అన్నారు. విశాఖ యువతే ఆంధ్రప్రదేశ్ కు బ్రాండ్ అంబాసిడర్లని నారా లోకేష్ పేర్కొంటూ...

(వాయిస్...23 సెకన్లు)

====================

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామమని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో విజయవాడలో 3 రోజులపాటు నిర్వహించే ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్ పో-2025ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులు ఇస్తున్నామని, పెట్టుబడులు పెట్టేందుకు ఇది సువర్ణవకాశమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న

పారదర్శక విధానాలు, పెట్టుబడులకు అనుకూల వ్యవస్థ, విజనరీ లీడర్ షిప్ కారణంగా రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొని, యువతకు లక్షలాది ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖలో వైజాగ్ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) అభివృద్ధిపై ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, కొల్లు రవీంద్ర లతో పాటు సీఎస్ విజయానంద్, వీఈఆర్ పరిధిలోని 9 జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. వీఈఆర్ మాస్టర్ ప్లాన్ అజెండాపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ సమగ్ర అభివృద్ధి, రోడ్లు, రైలు మార్గాలు, పోర్టులు, లాజిస్టిక్స్ ఇతర రంగాలకు సంబంధించి మొత్తం 49 ప్రాజెక్టులపైన చర్చలు జరిపారు. వీఈఆర్‌ను 2032 సంవత్సరం నాటికి 125 నుండి 135 బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.

====================

విరామం

====================

చింతూరు బస్సు ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో బస్సు ప్రమాదం జరిగిన స్థలాన్ని ఆమె ఈరోజు సందర్శించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్సు అతివేగంగా ప్రయాణించడమే ప్రమాదానికి కారణమని చెప్పారు. అవసరమైన చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, భద్రతా కారణాల దృష్ట్యా రాత్రివేళల్లో ఘాట్ రోడ్డులో ప్రయాణాలు నిలిపి వేస్తామని పేర్కొన్నారు. ప్రమాదంలో 9 మంది మరణించారని, గాయపడ్డ వారికి మెరుగైన చికిత్స అందిస్తామని హోంమంత్రి తెలిపారు.

(వాయిస్...23 సెకన్లు)

====================

వెలిగొండ ప్రాజెక్ట్ ను 2026 నాటికి పూర్తి చేసి, నల్లమల సాగర్ ను కృష్ణా జలాలతో నింపుతామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. వెలిగొండ ప్రాజెక్ట్ లోని రెండవ సొరంగం లైనింగ్ పనులను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రాజెక్ట్ పనులు చేస్తున్న ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో ప్రాజెక్ట్ పనులు వేగవంతమయ్యాయని చెప్పారు. ప్రాజెక్ట్ కు సంబంధించి హెడ్ వర్క్స్, టన్నెల్, ఫీడర్ కెనాల్, పునరావాసం వంటి క్లిష్టమైన పనులు చాలా పెండింగ్ లో ఉన్నాయని, వీటిని యుద్ధప్రాతిపదికన చేస్తున్నామని తెలియజేశారు.

====================

రాష్ట్రంలో అన్ని ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ లోనూ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయనున్నామని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లతో మంత్రి ఈరోజు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలోనూ సొసైటీని ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి వెల్లడించారు.

====================

ప్రజా రవాణా సంస్థ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. విజయవాడలో ఈరోజు నిర్వహించిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర ద్వితీయ మహాసభలను.. ఆయన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, దశల వారీగా ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం అమల్లో అధికారులు, ఉద్యోగులు, కార్మికుల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.

====================

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో 62 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న పబ్లిక్ బ్లాక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణ పనులకు ఆమె ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని వసతులతో కూడిన ఈ హెల్త్ యూనిట్ నిర్మాణం పూర్తయితే, స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు గొప్ప ప్రయోజనం చేకూరుతుందన్నారు. వైద్య, ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆమె వివరించారు.

=====================

నాణ్యతా ప్రమాణాలతో కూడిన నిత్యావసర సరుకులను ప్రజలకు అందించి, ప్రజాసంతృప్తి స్థాయిలను మెరుగుపరచాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి రేషన్ డీలర్లను ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్ లో రేషన్, ఎల్పిజి గ్యాస్ డీలర్లతో కలెక్టర్ జిల్లా స్థాయిలో సమావేశం నిర్వహించారు. డీలర్లు మంచి ప్రవర్తనతో కూడిన సేవలను పారదర్శకంగా అందించాలని సూచించారు. ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లు, రేషన్ డీలర్లు విధి విధానాలు సరిగా అమలు చేస్తూ, లబ్ధిదారులకు సేవలు సమయానికి అందించాలన్నారు.

=====================

=====================